క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు హారతి ఇస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ. మందిరంలో భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత పఠనం, హరే రామ హరే కృష్ణ సంకీర్తన జపం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం ఉత్తమ జీవన యానానికి ఉపకరిస్తుందన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు మహా రాజభోగ నివేదన చేసి అన్న ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.

ఎస్టీ పునరుద్ధరణకు లక్ష మందితో సభ నిర్వహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న జక్కుల శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం త్వరలో లక్ష మందితో సభ నిర్వహిస్తామని ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కుల శ్రీనివాసులు, క్రాంతినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో వాల్మీకి బోయల ఎస్టీ అంశంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా ఇవ్వాలని గత వైఎస్సార్‌సీపీ, టీడీపీ ప్రభుత్వాలు అసెంబ్లీలో ఆమోదం తెలిపాయన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి త్వరలో ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వాల్మీకి అర్జున్, నాయకులు బాల మద్దిలేటి, తలారి కృష్ణ, శివ, సత్రం రామకృష్ణుడు, రవి, పెద్దయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు చేపట్టాలి

కర్నూలు సిటీ: విద్యాశాఖలో మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన జీఓ 84ను సవరించి, వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోకారి, టి.కె జనార్దన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన ఎస్టీయూ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ టీచర్లకు సర్వీస్ రూల్స్ రూపొందించాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసి, వారి పదవి విరమణను 62 ఏళ్లకు పెంచాలన్నారు. కస్తూరిబాల్లో పని చేస్తున్న టీచర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిషు, తెలుగు మాధ్యమాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు డి.సుధీకర్, ముదసిర్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, దేవదాసు, సురేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కొక్కటిగా హామీలు నెరవేరుస్తున్నాం

కర్నూలు (టౌన్) : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం స్థానిక 47 వ వార్డు ధర్మపేట, బంగారుపేట కాలనీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మంత్రి పాల్గొని మాట్లాడారు. త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వందరోజుల్లో ప్రభుత్వం పట్టిన పనులను వివరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను అవిష్కరించారు. నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు (టౌన్) : తాను ప్రేమించిన అమ్మాయిఅత్మహత్యాయత్నం చేసుకుందని తెలిసి ఓ యువకుడు ఉరి వేసుకొని చనిపోయాడు. మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఈ కేసుకు సంబంధించిన వివరాలు ... పశ్చిమబెంగాల్ రాష్ట్రం మాల్డా జిల్లా, మొల్లాడమీ గ్రామానికి చెందిన సనాతన్ లోహార్ (18) అనే యువకుడు నగరంలోని సప్తగిరి నగర్‌లో ఉంటున్నాడు. స్థానికంగా కె. క్రిష్ణ అనే వ్యక్తి కొత్తగా కడుతున్న ఇంటికి పెయింటింగ్ పని కోసం ఇక్కడికి వచ్చాడు. శనివారం రాత్రి ఈ యువకుడు భోజనం చేయకుండా ఫోన్‌లో బాధపడుతూ మాట్లాడుతుండటంతో పక్కనున్న వారు ఆరా తీశారు. తన స్వగ్రామంలో ప్రేమించిన అమ్మాయి చావు బతుకుల మధ్య ఉన్నట్లు ఫోన్ వచ్చిందని చెప్పాడు. ఉదయంలోపు సనాతన్ గదిలో ఇనుప పైపుకు టవల్‌తో ఉరి వేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అలరించిన 'గయోపాఖ్యానం'



గయోపాఖ్యానం నాటకాన్ని తిలకిస్తున్న ప్రేక్షకులు, కళాక్షేత్రం సభ్యులు



నాటకంలోని ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: అనంతపురం శ్రీ వెంకటేశ్వర నాట్య మండలి కళాకారులు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం ప్రదర్శించిన 'గయోపాఖ్యానం'యుద్ధసీను ప్రేక్షకులను అలరించింది. శ్రీకృష్ణ పాత్రలో ధూపం తిరుమల తేజ, అర్జున పాత్రలో ధూపం రామకృష్ణ పాడిన పద్యాలు వన్స్‌మోర్ కొట్టించాయి. ఈ సందర్భంగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఒకప్పుడు పౌరాణిక నాటక రంగంలో కర్నూలు జిల్లా పేరును వెల్దుర్తి వెంకటరత్నం నాయుడు మార్మోగించారు. ఆ తరువాత పద్య నాటకంలో అటువంటి స్థానం పోషించిన నటులు అనంతపురం జిల్లా మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ధూపం రామకృష్ణ, తిరుమల తేజ అన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థిని ధూపం తిరుమల తేజ పద్య నాటకంలో రాణించడం విశేషం అన్నారు. కనుమరుగవుతున్న పౌరాణిక నాటకాలను ప్రతి ఒక్కరు ఆదరించి జీవం పోయాలన్నారు. అనంతరం ఇరువురు కళాకారులను సన్మానించి రూ. 25 వేలు నగదు పారితోషకంఅందజేశారు. కార్యక్రమంలో కళాక్షేత్రం పూర్వ అధ్యక్షుడు దస్తగిరి, కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వీవీ రమణారెడ్డి, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు లక్ష్మీకాంతరావు, యాగంటీశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, రాజారత్నం, తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో పలువురు బదిలీ

కర్నూలు(సెంట్రల్) : అటవీ శాఖలో పలువురు రేంజర్లు, స్క్వాడ్‌లను బదిలీ చేస్తూ ఆ శాఖ పీసీసీఎఫ్ చిరంజీవి ఉత్తర్వులు జారీ చేశారు. బద్వేల్ ఎఫ్ఆర్వోగా విధులు నిర్వహిస్తున్న పీవీ రమణారెడ్డిని కర్నూలు సోషల్ ఫారెస్టు డివిజన్ స్క్వాడ్‌కు బదిలీ చేశారు.అలాగే పెనుగొండ ఎస్ఎఫ్ రేంజర్‌గా పనిచేస్తున్న ఉదయ్‌దీప్‌ను నంద్యాల జీబీఎం రేంజర్‌గా, చిత్తూరు వెస్ట్ రేంజర్‌గా ఉన్న బాలకృష్ణారెడ్డిని బనగానపల్లె ఎస్ఎఫ్ రేంజర్‌గా, శ్రీశైలం ప్రాజెక్టు ఎఫ్ఆర్ఓగా ఉన్న నరసింహులును జమ్మలమడుగు ఎస్ఎఫ్ రేంజర్‌గా, శ్రీశైలం యాంటీ పోచింగ్ స్క్వాడ్‌గా ఉన్న సుభాష్‌ను శ్రీశైలంలోని పీటీ విభాగానికి బదిలీ చేశారు. అలాగే నంద్యాల జీబీఎం ప్రాజెక్టు టైగర్‌లో ఉన్న త్రినాథ్‌రెడ్డిని తిరుపతి డివిజన్‌లోని సత్యవేడు రేంజర్‌గా బదిలీ చేశారు. ఆత్మకూరు ఎఫ్ఎస్ఓగా ఉన్న శ్రీకాంత్‌ను మంగళగిరిలోని పీసీసీఎఫ్ కార్యాలయానికి మార్చారు.అలాగే పరిపాలన అధికారులుగా పనిచేస్తున్న వారిని కూడా బదిలీ చేశారు. ప్రకాశం డివిజన్ నుంచి ఎస్ఏ ఖాద్రీని నంద్యాల డివిజన్‌కు, పార్వతీపురం మన్యం డివిజన్ నుంచి ఏ చంద్రశేఖర్‌రాజును నంద్యాలకు, అనంతపురం సర్కిల్ కార్యాలయం నుంచి అహెసాన్‌ను కర్నూలు డివిజన్‌కు, అనంతపురం డివిజన్ నుంచి షానవాజ్ బాషాను కర్నూలు సర్కిల్ కార్యాలయానికి, ఎస్. అమానుల్లాను కర్నూలు నుంచి అనంతపురం సర్కిల్‌కు బదిలీచేశారు.

ఏహెచ్‌ఏలకు మినహాయింపు ఇవ్వాలి

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక సహాయకుల(ఏహెచ్‌ఏ)కు ఇతర శాఖల పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏహెచ్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.రాజేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఏపీఎన్‌జీఓ హోమ్‌లో గాడ్యుయేట్ వెటర్నేరియన్స్ పెడరేషన్ జిల్లా చైర్మన్ జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా పశు సంవర్ధక సహాయకుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఎన్నికల అధికారిగా గాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ జి.వెంకటేశ్వర్లు వ్యవహరించారు. అధ్యక్షురాలుగా పి.నాగవాసవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా సురేష్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంటుగా పి.వెంకటేష్, కోశాధికారిగా ఎం.భూపతి, ఉపాధ్యక్షులుగా జి.సురేష్‌బాబు, ఎన్.సుశీల, సంపత్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.శరత్, సంయుక్త కార్యదర్శులుగా బి.శ్రావణి, శివ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ నాయక్, కోశాధికారి మంజునాథన్ పాల్గొన్నారు.

స్త్రీ, పురుషులిద్దరిలోనూ సంతాన సమస్యలు



ఐఎస్ఏఆర్ జాతీయ కార్యదర్శి డాక్టర్ ఆశాభక్షిని సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో స్త్రీలలో ఒక్కటే సంతానలేమి సమస్యలు ఉంటాయన్నది అపోహ అని, ప్రస్తుతం స్త్రీతో పాటు పురుషునిలోనూ సంతానలేమి సమస్యలు అధికంగా ఉన్నాయని సీనియర్ వైద్యులు అభిప్రాయపడ్డారు. నగరంలోని మౌర్య ఇన్ హోటల్‌లో ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెంట్ రీ ప్రొడక్షన్(ఐఎస్ఏఆర్) ఆధ్వర్యంలో రెండురోజులుగా కొనసాగుతున్న ఏపీ చాప్టర్ రాష్ట్రస్థాయి సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పలు సైన్స్ సెషన్స్ నిర్వహించారు. ఇందులో గర్భాశయం, అండాశయంలో సమస్యలు, సంతానలేమి సమస్యలు ఎలా అధిగమించాలి, చికిత్స, పురుషుల్లో సంతానలేమి సమస్యలు, వాటిని ఎలా చికిత్స చేయాలి, పీసీవోఎస్ ఉన్న వారికి వచ్చే సమస్యలు, వాటిని ఎలా గుర్తించాలి, ఎలాంటి చికిత్సలు అందిస్తే వారు గర్భం దాలుస్తారనే విషయాలను చర్చించారు. సంతానలేమి సమస్యలకు పరిష్కారాలు కనుగొని చికిత్స అందించేందుకు ఇప్పుడు ఇన్‌ఫెర్టిలిటీ కేంద్రాలు అత్యాధునిక సేవలు అందిస్తున్నాయని చెప్పారు. కర్నూలు నగరంలోనూ ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐఎస్ఏఆర్ జాతీయ కార్యదర్శి డాక్టర్ ఆశాభక్షి, స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ పద్మలత యారాసి, కార్యక్రమం ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ విష్ణుప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ జి. విజయలక్ష్మి, ఈసీ మెంబర్లు డాక్టర్ శిరీషారెడ్డి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ భార్గవి, సీనియర్ గైనకాలజిస్టులు డాక్టర్ బీటీ సీత, డాక్టర్ సావిత్రి, డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గిరిజన సంక్షేమ బాలికల గురుకులాన్ని పరిశీలించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న హుసేన్ నాయక్

కర్నూలు(అర్బన్): తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ సభ్యులు జాటోతు హుసేన్ నాయక్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్స్ నిర్వహించిన సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం కర్నూలుకు వచ్చిన ఆయన స్థానిక బీ క్యాంప్‌లో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులానికి ఆయన చేరుకోగానే జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి జె. రంగలక్ష్మీదేవి ఆయనకు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన గురుకుల పాఠశాలలోని పరిసరాలు, తరగతి గదులు, కిచెన్, టాయ్‌లెట్లు, స్నానపుగదులు తదితర మౌలిక వసతులను పరిశీలించారు. అలాగే విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మీగురప్ప పాఠశాలకు అవసరమైన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా మరో 12 గదులు, 12 డార్మెటరీలు కావాలని, ఖాళీగా ఉన్న రెండు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ నేపథ్యంలోనే నెలకు రూ.12 వేల జీతంతో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను సీఆర్‌టీలుగా గుర్తించేలా చర్యలు చేపట్టాలని అవుట్ సోర్సింగ్ టీచర్లు కోరారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి. మద్దిలేటి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, బీజేపీ నాయకులు వేల్పుల గోపాల్, కోటి యాదవ్, సూర్యప్రకాష్, ట్రైబల్ స్టూడెంట్స్‌ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ చంద్రప్ప, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతరం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు స్థానిక హెడ్ పోస్టాఫీసులో ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ నిర్వహించిన సిల్వర్‌జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వై. జయరాజ్, ఆర్.కైలాస్‌నాయక్ పాల్గొన్నారు.

● కర్నూలు న్యూసిటీ : హౌసింగ్ శాఖలో పనిచేసే ఎస్‌టీఎస్, టెక్నికల్ సిబ్బంది జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిశారు. 19 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు.

సబ్‌రిజిస్ట్రార్ల బదిలీలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అడిషనల్ ఐజీ ఉదయ భాస్కరరావు

కర్నూలు(సెంట్రల్) : జోన్-4 పరిధిలో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. కర్నూలులోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు అడిషినల్ ఐజీ ఉదయ్ భాస్కరరావు హాజరవ్వగా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల డీఐజీలు కల్యాణి, విజయలక్ష్మి, గిరిజ హాజరై కౌన్సెలింగ్‌ను చేపట్టారు. మొత్తం నాలుగు జిల్లాల పరిధిలో పనిచేస్తున్న 85 మంది సబ్ రిజిస్ట్రార్లు హాజరయ్యారు. అలాగే సీనియర్ అసిస్టెంట్లకు కూడా కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఇతర కింది స్థాయి సిబ్బందికి జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. కాగా, కౌన్సెలింగ్‌లో అధికారులు ఎంపిక చేసుకున్న వివరాలను ఐజీకి పంపి, వారి అనుమతితో సోమవారం విడుదల చేసే అవకాశం ఉంది.

30న కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్) : కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చేయాలని కోరుతూ ఈనెల 30వ తేదీన చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు అరకొర జీతాలు ఇస్తున్నారని, అవి కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, సాయిబాబా, గోపాల్, విజయ్, ప్రభాకర్, ఉమాదేవి, వెంకటమ్మ, రేణుకమ్మ, బాల దుర్గమ్మ పాల్గొన్నారు.

200 మందికి వైద్య సేవలు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 32వ వార్డు ముజఫర్ నగర్‌లో ఆదివారం టీఎస్ లైబ్రేరీ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపునకు కైలాష్ క్లినిక్ వైద్యుడు అనిశ్వర్‌రెడ్డి హాజరై షుగర్, కంటిచూపు, థైరాయిడ్, బోన్ టెస్టింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో దాదాపు 200 మంది రోగులు వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.రాముడు, పీఎస్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

కర్నూలు(సెంట్రల్): పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన అబ్దుల్ దేశాయ్, బద్రున్నీసా కుమార్తె సానియా దేశాయ్‌కు అనంతపురం మెడికల్ కాలేజీలో డాక్టర్ సీటు రావడంతో ఆదివారం ఆ బాలికను సీపీఎం నాయకులు సన్మానించారు. సుందరయ్య భవన్‌లో జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆ బాలికకు శాలువ కప్పి సన్మానించారు. వైద్యురాలు అయిన తరువాత పేదలకు ఉచితంగా వైద్యం చేయాలని సానియా దేశాయ్‌ని కోరారు. నాయకులు మహ్మద్‌షరీఫ్, షేక్షావలి, మల్లికార్జున, బసీర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల మధ్య గొడవ

కర్నూలు(సెంట్రల్) : లోడు విషయంలో ఇరువురు లారీ డ్రైవర్ల మధ్య తలెత్తిన గొడవ కత్తులతో పొడుచుకునే వరకు వెళ్లింది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కల్లూరులోని చెన్నమ్మ సర్కిల్‌లో డోన్‌కు చెందిన లారీ డ్రైవర్ మాలిక్ బాషా, కర్నూలు చెందిన బషీర్ గొడవ పడ్డారు. వీరి గొడవ అంతకంతకు పెరిగిపోయి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. చివరకు బషీర్ మాలిక్ బాషాను కత్తితో పొడిచారు. వెంటనే స్థానికులు అతడిని 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి నన్నే బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): సెలవు దినాల్లో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు తరగతులు నిర్వహిస్తున్నా ఇంటర్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు అబుబకర్, సహాయ కార్యదర్శి మల్లేష్, ఆర్యన్ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. చైతన్య, నారాయణ కాలేజీలతోపాటు మరికొన్ని కాలేజీల్లో ప్రతి ఆదివారం తరగతులు జరుగుతున్నా అధికారులు అటువైపు చూడడం లేదన్నారు. ఫలితంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, కలెక్టర్ పి.రంజిత్‌బాషా విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించే పాఠశాలలు, కళాశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

టీటీడీ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలి

● భగవద్గీత పుస్తక వితరణ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్



భగవద్గీత పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్, తదితరులు

కర్నూలు సిటీ: తిరుమల తిరుపతి దేవస్థానం తన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం ఇండస్ స్కూల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మానవులందరికీ భగవద్గీత పుస్తక వితరణ కార్యక్రమం జరిగింది. ఇందులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. భగవద్గీత సృష్టిలో అత్యంత ఉన్నతమైన గ్రంథమని, మన దేశ గొప్పతనాన్ని చాటుతుందన్నారు. విద్యార్థులకు ఈ గ్రంథం గురించి తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. మాంటిస్సోరి ఇండస్ స్కూల్ నుంచి భగవద్గీత, రామాయణం పారాయణం పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులను మంత్రి అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లా విశ్రాంత కలెక్టర్ రామశంకర్ నాయక్, జిల్లా విశ్రాంత వైద్యాధికారి డా.పూజారి మోక్షేశ్వరుడు, ఇండస్, మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత కె.వి.ఎన్. రాజశేఖర్, ప్రిన్సిపాల్స్ మీనాక్షి, వి.విల్సన్ అగస్టీన్, శ్రీనివాసరెడ్డి, కామేశ్వరీ, మధుసూదన్, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డా.మల్లు వెంకట్‌రెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎద్దుల మహేశ్వరరెడ్డి, మారం నాగరాజు గుప్తా, ఆవోపా చీఫ్ మలిపెద్ది నాగేశ్వరరావు, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను వేధిస్తున్న హిమోఫీలియా



బాధిత చిన్నారులతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులను హిమోఫీలియా జబ్బు వేధిస్తోందని హెపటాలజిస్టు డాక్టర్ కాశీభారతి చెప్పారు. ఆదివారం పెంచికలపాడులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలో హిమోఫీలియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హిమోఫీలియా వ్యాధికి సంబంధించిన విషయాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన, వాడకూడని మందుల గురించి డాక్టర్ కాశీభారతి వివరించారు. మహిళాగ్రూపు సభ్యులు డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో హిమోఫీలియా బాధితులు వారి సమస్యలు చెప్పుకున్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల నుంచి 120 మంది హిమోఫీలియా బాధితులు హాజరై వారి ఇబ్బందులను పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎఫ్ఐ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ప్రసాద్, కర్నూలు చాప్టర్ అధ్యక్షుడు పార్థసారథి, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

'శ్రీకాంత శతక' కావ్యావిష్కరణ



శ్రీకాంత శతక కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: తెలుగు కల్లం సాహితీ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నావుల వెంకట రాజా రెడ్డి రచించిన ×శ్రీకాంత శతక¥ కావ్యావిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. హైదరాబాద్ అవధాన భారతి చందో వైవిధ్య నిష్ణాతులు చక్రాల లక్ష్మీకాంత రాజారావు, రాయలసీమ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, బాలల కథా రచయిత డాక్టర్ హరికిషన్, డోన్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు తొగట సురేష్‌బాబు అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు నీతి శతకాల్లో అద్భుతమైనది శ్రీకాంత శతకం అన్నారు. సామాజిక స్పృహ, దేశభక్తి, భారతీయతను కవి చక్కగా వివరించారన్నారు. అనంతరం శతక కర్త డాక్టర్ చిన్నావుల వెంకట రాజా రెడ్డి దంపతులను అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు అవధాని గంగుల నాగరాజు, నాగేశ్వరరావు, బెల్దోన కృష్ణమూర్తి, సమితి కార్యవర్గ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలి



కమిషన్ సభ్యుడికి వినతి పత్రం ఇస్తున్న టీఎస్ఎఫ్ నేతలు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వం మద్యం దుకాణాలను ఎస్సీ, ఎస్టీలకు కూడా కేటాయించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప కోరారు. ఈ అంశంపై ఆదివారం ఇక్కడకు వచ్చిన జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ సభ్యులు జాటోతు హుసేన్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీత కార్మికులకు పది శాతం మద్యం దుకాణాలు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. జీవనోపాధి, కుటుంబ పోషణ కోసం గిరిజన యువత నాటుసారా తయారీ, గంజాయి స్మగ్లింగ్ వంటి అడ్డదారులు తొక్కుతున్నారని, అదే మద్యం దుకాణాలు కేటాయించి ఉపాధి మార్గాన్ని చూపితే వాటి జోలికి పోకుండా గౌరవంగా జీవిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. వెంకటేష్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక



ఆత్మహత్య చేసుకున్న పెయింటర్ బోయకర్ణ

కర్నూలు(సెంట్రల్) : చేసిన అప్పులు తీర్చలేక ఓ పెయింటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..తెలంగాణలోని మానవపాడు మండలం జల్లపురం గ్రామానికి చెందిన బోయ కర్ణ (39) ఏడేళ్ల క్రితం భార్య పద్మ, కుమారుడు, కూతురుతో కలిసి కర్నూలు వచ్చి ఖండేరి వీధిలో నివాసం ఉంటున్నాడు. అతడు పెయింటింగ్ పనిచేసి కుటుంబాన్ని పోషించేవాడు. అయితే అతను తెలిసిన వాళ్ల దగ్గర రూ.5 లక్షలు అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక రోజు ఇంట్లో బాధపడేవారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 5గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎలుకల మందు తాగి పడిపోయాడు. స్థానికులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి భార్య పద్మకు సమాచారం ఇచ్చారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కోలుకోలేక కర్ణమృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీని అభినందిస్తున్న సభ్యులు

కర్నూలు(సెంట్రల్): టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం సీక్యాంపులోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో ఆ సంస్థ రాష్ట్ర కమిటీ ట్రెజరర్ బి.సురేష్‌బాబు, సభ్యుడు బి. విజయకుమార్ ఆధ్వర్యంలో సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బి.సుధాకర్, ఆర్.తిరుమలేశ్వరరెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కె.మల్లయ్య, ఎం.శ్రీధర్, సీ.రామకృష్ణ, కె.రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.నరసింహులు, అదనపు సెక్రటరీలుగా పి.ప్రదీప్, టీసీహెచ్ వెంకటస్వామి, ఎస్.నూర్ అహ్మద్, సురకిశోర్, ట్రెజరర్‌గా ఎన్.శ్రీనివాసులు, మహిళా ప్రతినిధులుగా కె.సుశీల, బి.శైలజలతోపాటు మరో 10మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

భీరలింగేశ్వర స్వామికి రూ.1.11 లక్షల విరాళం



చెక్కు అందిస్తున్న దాతలు

కర్నూలు(అర్బన్): నగర శివారులోని పెద్దపాడు రోడ్డులో ఆదర్శ పాఠశాల పక్కన నిర్మిస్తున్న శ్రీ భీరలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి దాతలు భారీగా విరాళాలు అందిస్తున్నారని కురవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. ఆదివారం అంబేడ్కర్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ నిర్మాణానికి స్థానిక సంతోషనగర్‌కు చెందిన దివంగత కురువ లింగారెడ్డి సతీమణి కురువ హనుమంతమ్మ, కుమారులు ఎంకే రాజశేఖర్, ఎంకే హరీష్, ఎంకే రఘునందన్ రూ.1,11,116 చెక్కు అందించారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం, కమ్యూనిటీ హాల్, విద్యార్థుల హాస్టల్ నిర్మాణానికి పెద్ద సంఖ్యలో దాతలు ముందుకు వచ్చి ఆర్థికంగా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల సుంకన్న, గుడిసె శివన్న, బీసీ తిరుపాలు, దేవేంద్ర, కే రాజు, కె. వెంకటేశ్వర్లు, కె. మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలని కోరారు.

నీటిముంపు బాధితులకు న్యాయం చేయండి

కర్నూలు, న్యూసిటీ: శ్రీశైలం రిజర్వాయర్ నీటి ముంపు బాధితులకు న్యాయం చేయాలని శ్రీశైలం ప్రాజెక్టు నీటిముంపు నిర్వాసితుల అవుట్ సోర్సింగ్ లస్కర్ల సంఘం నాయకుడు నాగన్న డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ఆదివారం జిల్లాకు వచ్చిన నీటిపారుదల శాఖ మంత్రి రామానాయుడుకు ఆసంఘం నాయకులు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.